క్లుప్తంగా

వీహెచ్‌పీ రాష్ట్ర సాంస్కృతిక ప్రముఖ్‌గా మల్లికార్జున్

చంపాపేట: విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర సాంస్కృతిక ప్రముఖ్‌గా చంపాపేటకు చెందిన బొడ్ల మల్లికార్జున్ నియమితులయ్యారు. ఈ మేరకు నియామకపత్రాన్ని పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పండరీనాథ్ సోమవారం చంపాపేటలో మల్లికార్జున్‌కు అందజేశారు. పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాఘవులు, సురేందర్‌రెడ్డి, యాదిరెడ్డి, సునీత, యాదగిరిరావు, రాజేశ్వర రెడ్డి, రేగుల మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు కేంద్రాల పరిశీలన

ఎల్‌బీనగర్: జీహెచ్‌ఎంసీ హయత్‌నగర్ సర్కిల్ పరిధిలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు తసుకుంటున్నామని డీసీ మారుతీదివాకర్ అన్నారు. సర్కిల్ పరిధిలోని నాగోలు, మన్సూరాబాద్, హయత్ నగర్ డివిజన్‌లలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాలను సోమవారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ ప్రాజెక్ట్ అధికారి బలారాం, సిబ్బంది పాల్గొన్నారు.

కాలనీల అభివృద్ధికి కృషి: కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: కాలనీలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించి ఆయా కాలనీలను అన్నివిధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. గౌతమ్ నగర్ కాలనీ సంక్షేమ సంఘ భవనానికి జరుగుతున్న మరమ్మతు పనులను సోమవారం కాలనీ వాసులతో కలసి కార్పొరేటర్ పరిశీలించారు. కార్యక్రమంలో కాలనీ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, బీజేపీ డివిజన్ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, పవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేతాజీకి నివాళి



దిల్‌సుఖ్‌నగర్‌లో నేతాజీకి నివాళులర్పిస్తున్న ఏబీవీపీ నేతలు

మలక్‌పేట: నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయ సాధన దిశగా విద్యార్థులు, యువత ముందుకు సాగాలని ఏబీవీపీ దిల్‌సుఖ్‌నగర్ కన్వీనర్ కుంచాల సాయిరామ్ అన్నారు. ఎల్‌బీనగర్ విభాగ్, దిల్‌సుఖ్‌నగర్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం సాయి చైతన్య జూనియర్ కాలేజీ వద్ద నేతాజీ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాష్‌చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హనుమాన్‌చారి, నాయకులు నాగరాజు, సతీష్, అభి, నరేంద్ర, విజయ్ పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

చైతన్యపురి: ఆర్టీసీ ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలు, అవసరమైన సలహాలు, సూచనలు తెలియజేసేందుకు మంగళవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు దిల్‌సుఖ్‌నగర్‌లోని హైదరాబాద్–2 డిపో మేనేజర్ ఆండాళు ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్గిర్, బీచ్‌కుండ, జూకల్, కొల్లాపూర్, విజయవాడ, బైలడిల్ల, జగదల్‌పూర్, బెంగళూరు, తొర్రూర్ బస్సులకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉన్నా, సూచనలు చేయాలన్నా ఫోన్: 99592 26249లో సంప్రదించాలని సూచించారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిత

టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి

నాగోలు: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని.. క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్‌ను సాకారం చేసుకోవచ్చని టీఎస్‌పీఎస్సీ చైర్మన్ డి. జనార్దన్‌రెడ్డి అన్నారు. నాగోలు డివిజన్ బండ్లగూడలో వి-స్పోర్ట్స్ అకాడమీలో ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్రెండ్స్ కప్–2023 ఇంటర్ క్లబ్ బ్యాడ్మింటన్ టోర్నీ విజేతలకు బహుమతుల ప్రదానోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న జనార్దన్‌రెడ్డి, రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తాలు విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో వరంగల్ టాస్క్ ఫోర్స్ ఏసీపీ జితేందర్‌రెడ్డి, ఏసీపీ వెంకట్‌రావు, మల్కాజ్‌గిరి ఏసీపీ నరేష్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ శోభన్‌బాబు, నరేందర్, రాజిరెడ్డి, రఘుపతిరెడ్డి, రవీంద్‌రెడ్డి, వేణు, కార్తీక్, జితేందర్ పాల్గొన్నారు.

ఆహ్వానం

మలక్‌పేట: రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ నేతలు సోమవారం తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ డాక్టర్ ఆంజయ్యగౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువతో సన్మానించారు. ఈ నెల 29 తేదీన అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న తెలంగాణ స్టేట్ బ్యాడ్మింటన్ ఓపెన్ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి రావాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కరెడ్ల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, కోశాధికారి యువన్‌బాబు, సభ్యులు పాల్గొన్నారు.

దివ్యాంగుల హాస్టల్‌లో... సమస్యల దరువు!

- అరకొర వసతులతో దివ్యాంగులకు తప్పని ఇబ్బందులు
- అపరిశుభ్రంగా మరుగు దొడ్లు, స్నానాల గదులతో పరేషాన్
- శిథిల భవనంలో ప్రమాదకర స్థితిలో దివ్యాంగ విద్యార్థులు

చంపాపేట: అది పేరుకే సంక్షేమ హాస్టల్... మరుగు దొడ్లకు తలుపులుండవు... తలుపులు ఉంటే నీళ్లు రావు... శిథిలావస్థకు చేరిన భవనం... గదుల ముందే నిత్యం మురుగు పరుగు... దోమలు, ఈగలు, బొద్దింకల స్వైర విహారం... దుప్పట్లు లేక చలికి గజగజ వణుకు.. అది చాలదన్నట్లు పురుగుల అన్నం, నీళ్ల చారు, ఉడికీ ఉడకని కూరలతో ముద్ద మింగుడు పడని దుస్థితి. ఇదీ చంపాపేట డివిజన్ రెడ్డి కాలనీలోని ప్రభుత్వ దివ్యాంగ బాలుర విద్యార్థుల హాస్టల్ దుస్థితి.

- నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించి శిథిలావస్థకు చేరిన అద్దె భవనంలో 17 సంవత్సరాలుగా హాస్టల్ కొనసాగుతోంది. వసతి గృహంలో 195 మంది దివ్యాంగ విద్యార్థులు ఉంటూ ఉన్నత చదువులు, పోటీ పరీక్షలుకు పుస్తకాలతో కుస్తీ పడుతూనే సమస్యలతో సహజీవనం చేస్తున్నారు.



తలుపులు లేని స్నానాల గది, మరుగు దొడ్డి

- దివ్యాంగ విద్యార్థుల వసతి గృహంలో కనీస వసతుల కల్పనకు నిధులు కేటాయిస్తున్నామని ప్రచార ఆర్భాటాలు చేస్తున్న ప్రస్తుత పాలకులు క్షేత్ర స్థాయిలో ఆచరణ మాత్రం శూన్యమని విద్యార్థులు ఆరోపిస్తున్నారు.
- ప్రతి పది మంది విద్యార్థులకు ఒక సహాయకుడిని నియమించాల్సి ఉండగా హాస్టల్‌లో కేవలం వార్డెన్, కుక్‌లతో కలసి మొత్తం సిబ్బంది ఆరుగురు మాత్రమే ఉన్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- రెండు సంవత్సరాలుగా నోట్ పుస్తకాలు, కాస్మొటిక్స్, ఇతర ఖర్చుల కోసం నెలకు అందించే రూ. 200లు మంజూరు కావటం లేదని దీంతో తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు సరిపడా స్నానాల గదులు, మరుగు దొడ్లు ఉన్నా కొన్నింటికి తలుపులు లేక నిరుపయోగంగా ఉన్నాయి. స్నానాల గదులు, మరుగు దొడ్లు, డైనింగ్ హాల్, వాష్ ఏరియాను నిత్యం మెయింటెన్స్ లేక అపరిశుభ్రంగా మారి ముక్కుపుటాలు అదిరే దుర్గంధం వెదజల్లుతోంది.
- విద్యార్థులకు తగ్గట్టుగా పడకలు, దుప్పట్లు లేక పోవటంతో చలితో కటిక నేలపై బొద్దింకలు, ఈగలు, దోమలు స్వైర విహారం నడుమే చలికి వణుకుతూ నిద్రించాల్సిన దుస్థితి ఏర్పడింది.
- హాస్టల్ భవనంలోని డ్రైనేజీ వ్యవస్థ శిథిలావస్థకు చేరటంతో నిత్యం విద్యార్థుల గదుల ముందే మురుగు పరుగు పెడుతూ గడప దాటి బయటకు రాలేని దుస్థితి ఏర్పడుతుందని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- ఉడికీఉడకని కూరలు, అన్నంలో పురుగులు, మెరిగలు, రాళ్లు వస్తున్నాయని ఇదేమని ప్రశ్నిస్తే వార్డెన్ నిర్లక్ష్యంగా సమాధానమిస్తుందని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



హాస్టల్ గదుల ఎదుట మురుగులో దివ్యాంగ విద్యార్థి

- ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే స్పందించి యుద్ధప్రాతిపదికన సమస్యలను పరిష్కరించక పోతే దివ్యాంగ విద్యార్థులతో కలసి పెద్ద ఎత్తున ఆందోళన చేసి ప్రభుత్వ కార్యకలాపాలు స్థంభింపజేస్తామని వారు హెచ్చరించారు.



ఉడికీ ఉడకని అన్నం

ఇంత నిర్లక్ష్యమా...



శిథిలావస్థకు చేరిన భవనంలో సమస్యలతో సహజీవనం చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. తింటానికి అన్నం సరిగా ఉండదు. రూముల ముందే మురుగు పరుగు. కిటికీలకు తలుపులు, దోమతెరలు లేవు. మరుగు దొడ్లలో ముక్కుపుటాలు అదిరే దుర్గంధం సమస్యలు పరిష్కరించరా.. దివ్యాంగులంటే ఇంత నిర్లక్ష్యమా?

– అందె రాంబాబు, దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ కార్యవర్గ సభ్యుడు

కొత్త భవనంలోకి మార్చాలి



17 సంవత్సరాలుగా పురాతన భవనంలో సమస్యలతోనే సహజీవనం చేస్తున్నాం. రెండు సంవత్సరాలుగా ప్రభుత్వం అందజేసే కాస్మొటిక్స్, దుప్పట్లు, నెలసరి ఖర్చుల రూ. 200 కూడా అందటం లేదు. ఇక్కడ ఉండలేని పరిస్థితి నెలొకంది. బయటకు వెళ్లలేని దుస్థితి. సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం వహిస్తే పెద్ద ఎత్తున ఆందోళనలు, నిరాహార దీక్షలు చేపట్టి ప్రభుత్వ కార్యకలాపాలు స్తంభింపజేస్తాం.

– రామ్‌చందర్, పీజీ విద్యార్థి

సమస్యలతో సహజీవనం



దివ్యాంగ విద్యార్థులపై ప్రభుత్వం చిన్న చూపు చూస్తోంది. ఇక్కడ సమస్యలతో సహజీవనం చేస్తున్నాం. ఉన్నత చదువులు చదువునేందుకు వచ్చాం... ఇన్ని తకరాలు ఉంటే చదువుకునేది ఎట్లా. ఉద్యోగాలు సాధించేది ఎట్లా. హాస్టల్ రూమ్‌లో సమస్యల దరువు. చదువుపై ఏకాగ్రత ఉండటంలేదు.

– శంకర్, బీటెక్ విద్యార్థి

వరద సమస్య పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



సరస్వతీనగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హస్తినాపురం: హస్తినాపురంలో వరద నీటి సమస్యతో పాటు, డ్రైనేజీ సమస్యలను శాశ్వత ప్రాతిపదికన పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని సరస్వతీనగర్, పిండినారాయణరెడ్డి నగర్, భాగ్యనగర్ ఫేజ్ 1, 2, నార్త్ ఎక్స్‌టెన్షన్ కాలనీ, శ్రీరామ అయోధ్యనగర్ కాలనీ, తుల్జాభవానీ నగర్, సత్యదేవ్‌ఎన్‌క్లేవ్ కాలనీలలో స్థానిక కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్‌తో కలిసి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మార్నింగ్ వాక్‌చేసి కాలనీలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బీఆర్‌ఎస్ పార్టీ హస్తినాపురం డివిజన్ అధ్యక్షుడు ఆండోజు సత్యంచారి, నాయకులు గజ్జల మాధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్‌నాయక్, శ్రీనివాస్ యాదవ్, ఉదయ్‌రెడ్డి, గోపీరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నాగిరెడ్డి, సయ్యద్, భిక్షపతి, సాయియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే బలాల సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: అభివృద్ధి పనులపై సోమవారం పంజేషాహ కార్యాలయంలో ఎమ్మెల్యే అహ్మద్ బలాల జీహెచ్‌ఎంసీ, విద్యుత్, జలమండలి అధికారులు, కార్పొరేటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న పనులపై అధికారులతో చర్చించారు. అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులపై దృష్టి సారించి వాటిని పూర్తి చేయాలని ఆదేశించారు. డివిజన్లలో అసరమైన ప్రాంతాలలో కొత్తపనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సమస్యలు సత్వర పరిష్కారం చేయాలని ఎమ్మెల్యే సూచించారు. అక్బర్‌బాగ్ కార్పొరేటర్ సయ్యద్ మినాజుద్దీన్, జలమండలి డీజీఎం షీలారాణి, జీహెచ్‌ఎంసీ ఈఈ మహిబూబ్‌మియా, డీఈ ప్రదీప్‌కుమార్, ఏఈ వెంకన్న, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

వనస్థలిపురం: బీపీసీఎల్ (భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్), అవేర్ (అవేర్ హెల్త్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్, నేషనల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్)ల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఆటోనగర్‌లో లారీల అడ్డా వద్ద నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి పరిసర ప్రాంతాల ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా 389 మందికి అంకిత, కామినేని, గ్లోబల్, మాధవన్‌జీ రూరల్ హోమియోపతి, సిరి డెంటల్ సర్జరీ ఆస్పత్రులకు చెందిన వైద్యులు వివిధ పరీక్షలు నిర్వహించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ... కాలనీలు, బస్తీల్లో ఏర్పాటు చేసే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గుండె జబ్బులు, నరాలు, షుగర్, కంటి వైద్యం, డెంటల్ తదితర సమస్యలపై పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి తగిన మందులను ఉచితంగా అందజేశారు. అవేర్ సంస్థ డైరెక్టర్లు సంజనరెడ్డి, వరుణ్, వెంకటరెడ్డి, కార్య నిర్మాణ అధికారి వెంకన్న, బీపీసీఎల్ నుంచి మశ్చేందర్, శ్రీనివాస్, యాదమ్మ, నాయకులు నక్క శ్రీనివాస్ యాదవ్, ఉమేష్ యాదవ్, వైద్యులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు

మరణిస్తూ మరో ఐదుగురికి 'జీవితం'



ఆనంద్‌రెడ్డి (ఫైల్)

మన్సూరాబాద్: తాను మరణిస్తూ మరో ఐదుగురికి తన అవయవాలను దానం చేసి వారి జీవితాన్ని అందించాడు. జీవన్‌ధాన్ ప్రతినిధి తెలిపిన వివరాల ప్రకారం... మల్కాజిగిరి ఎన్ఎండీసీ కాలనీలోని వినాయక టెంపుల్ సమీపంలో నివసించే గుందారపు ఆనంద్‌రెడ్డి(48) ప్రైవేటు ఉద్యోగి. ఈ నెల 18న పని నిమిత్తం ఎల్‌బీనగర్‌కు ఆనంద్‌రెడ్డి తన బైక్ వచ్చాడు. రాత్రి 7.30 గంటల ప్రాంతంలో ఆకస్మాత్తుగా బైక్‌పై నుంచి కిందపడ్డాడు. వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్‌కు తరలించారు. మూడు రోజుల పాటు ఆనంద్‌రెడ్డికి వైద్యులు ఎమర్జెన్సీలో చికిత్సను అందించారు. చికిత్సకు స్పందించక పోవడంతో ఈ నెల 21న బ్రెయిన్‌డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న జీవన్‌దాన్ ప్రతినిధులు ఆనంద్‌రెడ్డి భార్య కవితతోపాటు తండ్రి రాజరెడ్డిని కలిసి అవయవ దానంపై అవగాహన కల్పించారు. దీంతో కుటుంబ సభ్యులు ఆనంద్‌రెడ్డి రెండు కిడ్నీలు, లివర్, రెండు కార్నియాలను దానం చేసేందుకు అంగీకరించారు. ఆ అవయవాలను అవసరమున్న వారికి అమర్చాల నిజీవన్‌దాన్ సంస్థకు అందజేశారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

వనస్థలిపురం: పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ రవి, ట్రాఫిక్ ఎస్‌ఐ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం వనస్థలిపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐలు మాట్లాడుతూ... ఆన్‌లైన్‌లో షాపింగ్ చేసేటప్పుడు తక్కువ ధరల్లో వస్తున్నాయని నకిలీ వెబ్‌సైట్‌లలో వ్యక్తిగత వివరాలు, బ్యాంక్ వివరాలు తెలియజేసి మోసపోవద్దని సూచించారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే వీడియో కాల్స్‌ను లిఫ్ట్ చేయవద్దని, ఫేక్ మెసేజ్‌లను నమ్మవద్దని, లోన్ యాప్‌ల బారిన పడవద్దని సూచించారు. మీకు ఉద్యోగం ఇస్తామంటూ మెసేజ్‌స్ చేసి డబ్బులు కట్టమనే వారిని మోసగాళ్లుగా గుర్తించాలని అన్నారు. విద్యార్థినులు మగ పిల్లల వద్ద ఎలా నడుచుకోవాలో సూచించారు. తల్లిదండ్రులు, విద్యార్థులు అప్రమత్తంగా ఉంటేనే సైబర్ నేరాలకు చెక్ పెట్టవచ్చన్నారు. కళాబృందం సభ్యులు తమ ఆట, పాటలతో అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయురాలు ఎం.దుర్గలత, పీసీ వెంకట్, హోంగార్డు ఐలయ్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, పలు మరమ్మతు పనుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈ హన్మంత్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1:30 వరకు తీగలగూడ, అఫ్జల్‌నగర్, బంజారానగర్, రేస్‌కోర్స్ రోడ్, ఆర్‌టీఓ ఆఫీస్, బాలాజీ అపార్ట్స్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు. మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు కరణ్‌బాగ్, జీవీ పార్క్, జీఏ కాలనీ, నియోరాయల్ స్కూల్, శ్రీనివాస కమ్యూనిటీ హాల్, రామాలయం, పద్మావతి కళ్యాణ మండపం, కెనరా బ్యాంక్, సరూర్ నగర్ ట్యాంక్ రోడ్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈ వివరించారు.

నీటి సమస్యను పరిష్కరించండి

లింగోజిగూడ: కాలనీలలో నెలకొన్న తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అధికారులను కోరారు. డివిజన్‌లోని మంచి నీరు, డ్రైనేజీ సమస్యలపై సోమవారం వాటర్ వర్క్స్ డీజీఎం సరిత, ఏఈ పవిత్రతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ... డ్రైనేజీ మ్యాన్‌హోల్‌లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని, మూతలు లేని మ్యాన్ హోల్స్‌ను గుర్తించి మూతలు ఏర్పాటు చేయాలని కోరారు. కాలనీలలో రోడ్లపైకి నీటిని విచ్చలవిడిగా వదులతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు మల్లారపు శ్రీనివాస్, శ్రీధర్‌గౌడ్ తదతరులు పాల్గొన్నారు.



సమస్యలపై చర్చిస్తున్న కార్పొరేటర్ దర్పల్లి

నీరు వృథా: వ్యక్తికి జరిమానా

మన్సూరాబాద్: విలువైన తాగునీటిని వృథా చేసినందుకు ఓ వ్యక్తికి జీహెచ్‌ఎంసీ అధికారులు జరిమానా విధించారు. వివరాలివీ... మన్సూరాబాద్ పద్మావతీనగర్ కాలనీకి చెందిన షానవాజ్ అనే వ్యక్తి ప్లాట్ నెంబర్–28లో నివాసముంటున్నాడు. సోమవారం ఉదయం తన ఇంటి ఎదుట తాగునీటి అడ్డుగోలుగా పారబోయటాన్ని స్థానికులు గుర్తించి జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలానికి చేరకున్న అధికారులు నీటిని వృథా చేసిన వ్యక్తికి రూ. 500 జరిమానాను విధించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ... మొదటిసారి అయినందున తక్కువ జరిమానా విధించామని, మరోసారి జరిగితే రూ. 10 వేల వరకు జరిమానా విధిస్తామన్నారు.

పెళ్లి పేరుతో వితంతువుకు బురిడీ

రూ. 9.32 లక్షలు కాజేసిన నిందితుడి అరెస్టు

నాగోలు: సులువుగా డబ్బు సంపాదిందుకు ఓ వ్యక్తి ఇండియన్ ఎయిర్‌లైన్స్ అధికారిగా నటిస్తూ పెళ్లి ముసుగులో వితంతువు నుంచి రూ. 9.32 లక్షలు కాజేశాడు. ఈ కేసులో నిందితుడిని రాచకొండ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల సమాచారం మేరకు... రాచకొండ పరిధిలో నివాసం ఉండే ఓ వితంతువు పెళ్లి కోసం తన వివరాలను ప్రముఖ మ్యాట్రిమోనీ వెబ్‌సైట్‌లో జూలై 2022లో అప్‌లోడ్ చేసింది. మంచిర్యాల జిల్లా నస్పూర్ మండలానికి చెందిన కర్ల కార్తీక్(34) ప్రైవేట్ ఉద్యోగి. కార్తీక్ మ్యాట్రిమోనిలో వితంతువు ఫోన్ నంబర్ తీసుకుని వాట్సాప్ ద్వారా ఆమెతో పరిచయం పెంచుకొని తాను ఇండియన్ ఎయిర్‌లైన్స్ అధికారిగా చెప్పుకొని చాట్ చేశాడు. కొంతకాలం తర్వాత ఇద్దరూ స్నేహితులయ్యారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి మహిళ బ్యాంక్ ఖాతాలలో ఉన్న రూ. 9.32 లక్షలను అనేక సార్లు తన అకౌంట్లో బదిలీ చేయించుకున్నాడు. ఆ తర్వాత ఫోన్ ఎత్తకపోవడంతో మోస పోయినట్లు గ్రహించిన ఆ మహిళ రాచకొండ సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు సోమవారం కార్తీక్ అరెస్టు చేశారు.

భక్తిశ్రద్ధలతో వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం



కొత్తపేట ఆలయంలో ఆత్మార్పణ దినోత్సవంలో పాల్గొన్న శ్రీనివాస్‌గుప్తా, కోలేటి దామోదర్



అల్కాపురిలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

నాగోలు: శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో శుక్రవారం తోట శ్రీదేవి ఆధ్వర్యంలో సోమవారం శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్, గొరిశెట్టి ప్రభాకర్, ప్రవీణ్, ఇతర ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

వనస్థలిపురంలో...

వనస్థలిపురం: వనస్థలిపురంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజలకు తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్‌గుప్తా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జయరాములు, రవికుమార్, విజయ్‌కుమార్, పరమేశ్వర్, తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

అల్కాపురిలో...

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీ వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని సోమవారం అల్కాపురిలోని శ్రీ కృష్ణ మందిరంలో నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడు పొద్దుటూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గోమాత పూజ, గణపతి హోమం, 102 కలశాలచే అమ్మవారికి అభిషేకం, వాసవి మాత పారాయణాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా, పోలీస్ హౌసింగ్ బోర్డ్ చైర్మన్ కొల్లేటి దామోదర్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు తాడేపల్లి వెంకటేశం, చైతన్యపురి కార్పొరేటర్ రంగ నర్సింహ్మాగుప్తా, నాయకులు శ్రవణ్‌కుమార్, వేణుమాదర్, బాలశం, పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

కోహెడ మార్కెట్ భూమిని యాజమాన్య పద్ధతిలో కేటాయించండి

ప్రభుత్వానికి కమీషన్ ఏజెంట్ల విజ్ఞప్తి

సాక్షి, సిటీబ్యూరో: వనపర్తి మార్కెట్ తరహాలోనే బాటసింగారం మార్కెట్ కమీషన్ ఏజెంట్లకు యాజమాన్య పద్ధతిలో కోహెడ మార్కెట్ భూమిని కేటాయించాలని ది హోల్‌సేల్ ఫ్రూట్ కమీషన్ ఏజెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తాజొద్దీన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం »సాక్షి«తో ఆయన మాట్లాడుతూ... బాటసింగారం పండ్ల మార్కెట్ కమీషన్ ఏజెంట్లు కోహెడలో భూమి కేటాయించాలని కోరుతున్న విషయం కొత్తేమీ కాదన్నారు. గ్రేటర్ పరిధిలోని బోయిన్‌పల్లి మార్కెట్, గుడిమల్కాపూర్ పూల మార్కెట్‌లు ఏర్పాటుకు ముందు మార్కెటింగ్ శాఖ అక్కడి కమీషన్ ఏజెంట్లుకు వ్యాపారం చేసుకోవడానికి మార్కెట్ భూమిని యాజమాన్య పద్ధతిలో కేటాయించిందని గుర్తు చేశారు. కొత్తపేట మార్కెట్ స్థలం సరిపోవడం లేదని పదేళ్ల క్రితం కోహెడలో పండ్ల మార్కెట్ కోసం 178 ఏకరాల భూమి గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ పేరుతో మార్కెటింగ్ శాఖ కొనుగోలు చేసింది. ఈ భూమి కొనుగోలులో ఎక్కవ వాటా కొత్తపేట పండ్ల మార్కెట్‌ది ఉందన్నారు. కొత్తపేట మార్కెట్‌తో ట్రాఫిక్ అంతరాయం కలుగుతుందని కోహెడలో తాత్కాలిక షెడ్లు నిర్మించి మార్కెట్‌ను తరలించారు. గతేడాది మార్కెట్ స్థలంలో ఆస్పత్రి నిర్మించడానికి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అదే సమయంలో వనపర్తి మార్కెట్‌లా పండ్ల మార్కెట్ కమీషన్ ఏజెంట్లకు కూడా భూమి కేటాయించాలని ప్రభుత్వానికి లేఖ కూడా రాసినట్లు చెప్పారు. కోహెడలో భూమి యాజమాన్య పద్ధతిలో కేటాయింపు విషయం తమ సంఘం ఒక్కటే చెప్పడం లేదని ఇతర కమీషన్ ఏజెంట్ల సంఘాలు కూడా ప్రభుత్వాని విజ్ఞప్తి చేస్తున్నాయని చెప్పారు. ఇప్పటికైనా కమీషన్ ఏజెంట్లకు ప్రభుత్వం కోహెడలో యాజమాన్య పద్ధతిలో భూమి కేటాయించాలని కమీషన్ ఏజెంట్లు విజ్ఞప్తి చేస్తున్నారు.